# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 20కు పైగా కీలక అంశాలకు ఆమోదం లభించింది.
- ❖ ఈరోజు విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది.
- ❖ ప్రపంచ స్థాయి యూనివర్సిటీలతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు పోటీ పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
- ❖ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి తెలియజేశారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం అమరావతిలోని సచివాలయంలో ఈరోజు సమావేశమయ్యింది. సుమారు మూడున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో 20కి పైగా అజెండా అంశాలకు ఆమోదం లభించిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులకు వివరించారు. మౌలిక వసతులు, ఉద్యోగ, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల వంటి అంశాలపై మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. రామాయపట్నంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు 354 కోట్ల రూపాయల పాలనా అనుమతులకు అంగీకారం తెలిపింది. అమరావతిలో పలు నిర్మాణాలకు 1,208 కోట్ల రూపాయల పాలనా అనుమతులకు ఆమోదం లభించింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

రాష్ట్రంలో ఈరోజు విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 85.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 82.68 శాతం ఉత్తీర్ణత పొందారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో ప్రధమ స్థానాన్ని కైవసం చేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా నాలుగోసారి రాష్ట్రంలో అగ్రస్థానాన్ని సాధించడం జిల్లా విద్యాశాఖ చరిత్రలో గొప్ప మైలురాయి అని జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ విజయం మన్యం జిల్లా విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనేందుకు నిదర్శనమన్నారు. పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థులు వరుసగా 4వ సారి ప్రథమ స్థానం సాధించడం ఆనందకరమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.

====================

ప్రపంచ స్థాయి యూనివర్శిటీలతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు పోటీ పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యా విభాగాలపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు రావాలని.. కోర్సుల ఫోర్ క్యాస్టింగ్ జరగాలని సూచించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సుల రీస్ట్రక్చరింగ్ జరగాలని దిశానిర్దేశం చేశారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్ లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థలో మార్పులు చేపట్టాలని సూచించారు. క్వాంటం టెక్నాలజీపై కోర్సును ప్రారంభించిన ఆంధ్రా యూనివర్సిటీని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

====================

రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో.. టైటాన్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ గ్రూప్ ఛైర్మన్, సీఈఓ కె. గిరి కుమార్, ఇతర ప్రతినిధులు సచివాలయంలో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారు. కర్నూలు ఎయిర్ పోర్టులో MRO ఎండ్ సిమ్యులేషన్ సెంటర్ల ఏర్పాటునకు, నంద్యాల జిల్లాలో డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థాపనకు సుముఖంగా ఉన్నట్టు తెలియజేశారు. సంస్థకు ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, మైనింగ్, ట్రేడింగ్ రంగాలలో ఉన్న అనుభవాన్ని సంస్థ ప్రతినిధులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి.. ప్రస్తుతం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉందని టైటాన్ సంస్థ ప్రతినిధులకు తెలియజేశారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలియజేశారు.

విరామం

====================

ఈరోజు విడుదలైన పదవ తరగతి ఫలితాల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల (ఎంజేపీ) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వంద ఎంజేపీ పాఠశాలలకు చెందిన 5 వేల 433 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా.., 96.02 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు SSC ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలోని మొత్తం 13 మంది విద్యార్థులు, హిందూపురం ప్రభుత్వ అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలోని 6 మంది విద్యార్థులు మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఒంగోలు ప్రభుత్వ వినికిడి లోపం ఉన్నవారి రెసిడెన్షియల్ పాఠశాల నుండి 16 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 12 మంది మొదటి శ్రేణిలో, నలుగురు రెండో శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల ప్రభుత్వ వినికిడి లోపం ఉన్నవారి రెసిడెన్షియల్ పాఠశాల నుండి 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై.. శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

====================

రేపటి నుండి ప్రారంభం కానున్న ఇంటింటి జనగణన ప్రక్రియకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. అమరావతి నుంచి రాష్ట్ర జనగణన నోడల్ అధికారి రావత్, స్టేట్ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ నివాస్ ఈరోజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. జిల్లాల వారీగా జనగణన సన్నద్ధతను పరిశీలించారు. ఈ సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ... ఇంటింటి గణన ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఎన్యూమరేటర్లందరికీ ఇప్పటికే తగిన శిక్షణ ఇచ్చామని, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామని తెలిపారు.

====================

జలధార-జలహారతి పనులను సకాలంలో పూర్తి చేసి జిల్లాను తొలి స్థానంలో నిలపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జలధార-జలహారతి కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత ప్రాధాన్యతతో, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. సుమారు 2 లక్షల సోక్ పిట్స్ లక్ష్యాన్ని సాధించాలని, వర్క్ ఆర్డర్లతో కూడిన చెరువుల పునరుద్ధరణ పనులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో జలధార-జలహారతి కింద ఎన్ని పనులు మంజూరయ్యాయి.. వాటి ప్రస్తుత స్థితి ఏమిటి అనే అంశాలపై పూర్తి స్థాయి చెక్ లిస్ట్ సిద్ధం చేసుకొని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు కృష్ణా జిల్లాలో పర్యటించి.. వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలకు వెళ్లనున్నారు. ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం 'మేడే'ను పురస్కరించుకుని ముఖ్యమంత్రి భవన నిర్మాణ కార్మికులతో సమావేశం అవుతారు. గుడ్లవల్లేరులో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

====================
====================